కె.బాలగోపాల్

# హిందుత్వ అజెండాలో ఆదివాసులు!

> తమ రాజకీయ లక్ష్యాన్ని సాధించుకోవడానికి ఆదివాసులు పనికొచ్చినప్పుడు వారి సహజమైన మిలిటెన్సీని హిందుత్వవాదులు చాలా క్రూరంగా వాడుకుంటున్నారు. గుజరాత్ మారణ కాండలో ఆదివాసీ ప్రాంతాలలో ఇది చూశాం. ఛత్తీస్‌గఢ్‌లో సల్వా జుడుం రూపంలో చూశాం. ఇప్పుడు కంధమాల్‌లో చూస్తున్నాం.

వాళ్ళ నాయకులు టీవీల ముందు గంభీరంగా కనిపిస్తారు. దేశ పాలనా విధానాల గురించి తమ ఆలోచనలను ప్రకటిస్తారు. తాము అధికారానికి వస్తే ఏయే విషయాలలో ఎంత మేలు చేయబోయేదీ గొప్ప విజ్ఞత టలవారిలాగ చెప్తారు. మరి కొందరు నాయకులు బహిరంగ వేదిక లెక్కి చంపుతాం, నరుకుతాం అని కేకలు వేస్తారు. వారిని పోలీసులు అరెస్టు చేయరు. వారి సభలకెప్పుడూ అనుమతి నిరాకరించరు. మరి కొందరు ఊర్లలో పల్లెలలో పరమతస్థులపైన దాడులు చేస్తారు. ప్రార్థనా స్థలాలను కూలుస్తారు. కాలుస్తారు. అడ్డొచ్చిన వారిని నరుకుతారు, తగలబెడతారు.

అయినప్పటికీ వారిది గౌరవనీయమైన రాజకీయపక్షంగానే భావించబడుతుంది. వారి ప్రధాని అభ్యర్థిని వారు ముందుగానే ప్రకటించడం అభినందించబడుతుంది. వారి పాదయాత్రలు, జాతాలు నిర్విఘ్నంగా సాగుతుంటాయి. వారి గుర్తింపు ఎప్పుడూ రద్దు కాదు. ఎన్నికల ప్రచారం నుంచి సాయుధ వీధి రౌడీయిజం దాకా అన్నీ ఏకసమయంలో సాగుతుంటాయి. 'అవును, మేమే చంపాము' అని ప్రకటించి మరీ చంపినా వారిని అరెస్టు చేయరు. నిషేధాల ఛాయ కూడ వారి దరికిరాదు. తమ రాజకీయ లక్ష్యాల సాధన కోసం హింసా మార్గాన్ని ఎంచుకోవాలన్న నిర్ణయం ఇతరులకు చాలా కష్టతరమయినది. నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి రహస్య జీవితంలోకి పోవాలి. దాక్కొని పనిచేసే స్థావరాలు వెతుక్కోవాలి. ధైర్యంగా సహాయం చేసే వారిని అన్వేషించాలి. పోలీసుల వేధింపులూ అరెస్టులూ చిత్రహింసలూ ఎన్‌కౌంటర్లూ ఎదుర్కోవాలి.

వీరికి ఆ సమస్య లేదు. తామే అధికారంలో ఉంటూ కూడ ప్రత్యర్థి సామాజిక వర్గాల పైన హింసాత్మక దాడులు చేయగలరు. అప్పుడే ఇంకా బాగా చేయగలరు. అయితే దేశంలో అధిక సంఖ్యాకులు ఆరాధించే దేవుళ్ళ పేరు మీద వీరి రాజకీయం నడుస్తుంది కాబట్టి వీరి ఆగడాలకు అడ్డుకట్టు వేసే ధైర్యం వీరు అధికారంలో లేని కాలంలోనూ, లేని రాష్ట్రాలలోనూ కూడ పాలనా యంత్రాంగం చేయడం లేదు. రాముడి పేరు మీద వినాయకుడి పేరు మీద నడిచే రాజకీయ హింసను ముఖాముఖీ ఎదుర్కొంటే ఆ దేవుళ్ళ భక్తులు దూరం అవుతారేమోనని వైరి రాజకీయ పక్షాలు వెనకాడుతున్నాయి. వారి వోట్లు సంగతేమోగాని భారతదేశాన్ని నాగరిక దేశంగా చెప్పుకోవడానికి సందేహించే రోజులు దరికొచ్చాయి.

ఈ దౌర్జన్యంలో ఒక పద్ధతి ఉందన్న విషయం ఎంత మంది గ్రహించారో తెలీదు. హిందూ రాష్ట్రాన్ని మీది నుంచి నిర్మించడం కష్టమయితే కింది నుంచి నిర్మించాలన్న వ్యూహం ఇందులో ఉంది. మీది నుంచి నిర్మించడానికి రాజ్యాంగం ఆటంకం. దానిని సమీక్షించాలన్న ప్రతిపాదన పెట్టి మొదటి మెట్టుగా తమ వారు కాని వారితో కమిటీ వేసి ఒక సమీక్ష చేయించారు. ఈ సారి అధికారానికి వస్తే ఆ సమీక్షను సమీక్షించడానికి వేరొక కమిటీ వేస్తారేమో చూడాలి. అయినా ఇది చాలా సమయం తీసుకుంటుంది. దానికి ప్రత్యామ్నాయం కింది నుంచి అమలు చేయడం. మత స్వేచ్ఛ రాజ్యాంగంలో ఉంటే ఉండనివ్వండి. జై శ్రీరాం అనకపోతే బతకనివ్వరన్న భయం అన్య మతస్థులలో కలిగిస్తే సరి. ఒక్క మత స్వేచ్ఛే కాదు, అన్ని రకాల భావప్రకటనా స్వేచ్ఛ ఒక హక్కేనని రాజ్యాంగంలో రాసి ఉండవచ్చు. కానీ తమకు నచ్చని భావాలు వ్యక్తం చేస్తే 'దేశ ద్రోహులు' అని పేరు పెట్టి గుంపును పోగు చేసి పోలీసులు చూస్తుండగానే రోడ్లో నరుకుతారని భయం కలిగిస్తే సరి. ఈ స్థితిని చేరుకున్న ప్రాంతాలు దేశంలోని ఉత్తర, పశ్చిమ భాగాలలో ఇప్పటికే చాలా వున్నాయి. ఒక సారి జాబితాలో చేరిన ప్రదేశాలు బయటికి పోవడం కష్టం. కానీ కొత్తవి చేరుతుంటాయి. ఈదుస్థితి ఉత్తర భారతం నుంచి క్రమంగా కిందికి పాకి మన సరిహద్దు సమీపానికొచ్చింది.



ఒరిస్సాలోని కంధమాల్ జిల్లా మన సరిహద్దు కెంతో దూరంలో లేదు. ఆ రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా అధికారం పంచుకొని చలాయిస్తున్న బిజెపి పాలనలో ఒక్క కంధమాల్ జిల్లాలోనే కాదు, ఆ రాష్ట్రంలోని అటవీ ప్రాంతాలంతటా క్రైస్తవాన్ని నమ్మడానికీ ఆచరించడానికీ వీలులేని పరిస్థితి ఏర్పడింది. చర్చిల దహనం, క్రైస్తవుల ఇళ్ళ దహనం అడపా దడపా కొన్నేళ్ళుగా జరుగుతున్న ఘటనలే. గడచిన నెల రోజుల ఘటనలు పత్రికలు కెక్కడానికి కారణం పరిమాణంలోని హెచ్చుదల మాత్రమే. ఆగస్ట్ నెల చివరి వారంలో కొన్ని వందల బహుశా వేల– ఇళ్ళు, చర్చిలు, స్కూళ్ళ తగుల బెట్టి 27 వేల మందిని క్యాంపుల పాలుచేశారు. చాలామందిని హతమార్చారు. ఆగస్ట్ 23 రాత్రి విహెచ్‌పి నాయకుడు లక్ష్మణానంద సరస్వతిని జాలస్ పేటలో మావోయిస్టులు చంపారు. చంపింది మావోయిస్టులేనని పోలీసులన్నారు. ఆ తరువాత మావోయిస్టులూ ప్రకటించారు. కాని లక్ష్మణానందను చంపింది మావోయిస్టులు కారనీ క్రైస్తవులేననీ, మావోయిస్టులు మత ఘర్షణలలో జోక్యం చేసుకోరనీ విహెచ్‌పి అంటూ వచ్చింది. బహుశా మావోయిస్టులు చేసిన ఒకహత్య వారి పని కాదని హిందుత్వవాదులు ప్రచారం చేసిన ఏకైక ఉదంతం ఇదే కావచ్చు.

ఈ ఔదార్యానికి కారణం స్పష్టమే. హత్య మావోయిస్టులే చేశారని ఒప్పుకుంటే క్రైస్తవుల పైన చేస్తున్న దాడులకు బహానా ఉండదు. క్రైస్తవులే చేశారంటే ఆ తరువాత జరిగిన హింసయావత్తు లక్ష్మణానంద చేసిన సంఘ సేవ వల్ల ప్రయోజనం పొందిన ఆదివాసుల ధర్మాగ్రహం ఫలితమేని ప్రచారం చేసుకోవచ్చు. చేసుకుంటున్నారు కూడ కానీ క్రైస్తవ మిషనరీలు చేసిన సేవలే లక్ష్మణానంద కూడ చేశాడని చెప్పి వాళ్లను దుర్మార్గులనడంలో అర్థం కనిపించదు. లక్ష్మణానంద ఆదివాసుల కోసం ఆశ్రమ పాఠశాలలు నెలకొల్పాడనీ, మంచి బతుకు నేర్పించాడనీ, తాగుడు మానుకొమ్మన్నాడనీ, శుభ్రత అలవరచాడనీ అంటున్నారు. క్రైస్తవ మిషనరీలు కూడా అదేపని చేశారు మరి. వాళ్ళు మతవ్యాప్తి కోసం చేశారంటే ఈయనా అందుకోసమే చేశాడు మరి. మిషనరీలు ప్రధానంగా హైందవ సమాజానికి అంటరానివారైన దళితులలో మత వ్యాప్తి చేపట్టగా విశ్వహిందూ పరిషత్ ప్రధానంగా ఆదివాసులలో మత వ్యాప్తి చేపట్టింది. ఆదివాసులు హిందువులన్న తప్పుడు అభిప్రాయం వల్ల వీరు చేసింది ఇదేనన్న విషయం చూడలేక పోతే అది మన తప్పు. ఆదివాసులు హిందువులు కారు. క్రైస్తవులు కారు. వారిలో ఏ మత వ్యాప్తి జరిగినా అది మత మార్పిడే. అదనంగా లక్ష్మణానంద ఆధ్వర్యంలో క్రైస్తవం పుచ్చుకున్న దళితులను 'శుద్ధి' కార్యక్రమం ద్వారా వెనక్కి తెచ్చే యత్నమూ జరిగింది. వారు ఆవు పేడతో కలిసిన నీళ్ళు తాగాలి, బైబిల్‌ను చింపేయాలి, ఇంకెప్పుడైనా చర్చికి పోతే చచ్చిపోయినట్టేనని ఒట్టు పెట్టుకోవాలి. దీనికి 'పునరాగమనం' (ఘర్ వాపసీ) అని పేరు పెట్టినప్పటికీ ఇదీ మత మార్పిడీయే. ఒకటే తేడా – క్రైస్తవ మిషనరీలు బలవంతం చేసి మతం మార్చలేదు. కాని పునరాగమనం అని పిలువబడిన మత మార్పిడి తరచుగా హింసాత్మక రూపం తీసుకుంది. ఇప్పుడు అతి క్రూరమైన రూపం తీసుకుంటున్నది. నిజానికి హిందూ ధర్మ వ్యాప్తిని సాధించడం కంటే క్రైస్తవ మత వ్యాప్తిని నిరోధించడం లక్ష్మణానంద చేపట్టిన కార్యక్రమాల ముఖ్య లక్ష్యం. అదే ఘర్షణకు దారి తీసింది. ఈ అణచివేతను వ్యతిరేకించే ప్రజాతంత్ర రాజకీయ కార్యాచరణను చేపట్టే బదులు లక్ష్మణానందను హతమార్చడం ఏ పాటి విజ్ఞతతో చేసిన పని అని మావోయిస్టులు భావిస్తున్నారో తెలియదు గానీ, విశ్వహిందూ పరిషత్ దానిని అవకాశంగా తీసుకొని క్రైస్తవులపైన దాడిని ముమ్మరం చేసింది.

ఆగస్ట్ 24వ తేదీన లక్ష్మణానంద మృత దేహాన్ని జాలస్ పేట నుంచి అతను తొలుత ఆశ్రమ పాఠశాల నెలకొల్పిన చౌకాపడ వరకు ఊరేగింపుగా తీసుకుపోయారు. నేరుగా పోకుండా క్రైస్తవులు ఎక్కువగా ఉండే మార్గాన్ని ఎంచుకున్నారు. దారి పొడవునా కొంత విధ్వంసం చేసుకుంటూ పోయారు గానీ అసలు హింస తిరుగు ప్రయాణంలో జరిగింది. 25వ తేదీన అతని అంత్యక్రియలకు ప్రవీణ్ తొగాడియా హాజరయి అతని మామూలు పద్ధతిలో హింసను రెచ్చగొట్టే ఉపన్యాసం ఇచ్చాడు. అక్కడి నుంచి తిరిగిపోతూ ఒక పద్ధతి ప్రకారం క్రైస్తవ గృహాలనూ చర్చిలనూ విద్యా సంస్థలనూ దహనం చేస్తూ ధ్వంసం చేస్తూపోయారు. వారి చేతులలో కత్తులు, పెట్రోలు, తుపాకులు ఉన్నాయి. అప్పటికి జిల్లా అంతటా కర్ఫ్యూ అమలులో ఉంది. కాని కర్ఫ్యూ బాధితులను సంఘటితం కాకుండ ఆపిందే తప్ప దుండగులకు అడ్డం రాలేదు. వారు కర్ఫ్యూ లోనే చేయవలసిందంతా చేశారు. ఇవ్వాళ్టికీ ఇదికొనసాగుతూనే ఉంది. మొన్నటి 18వ తేదీన రైకియా బ్లాక్‌లో రహదారి పక్కన ఉన్న అనేక గ్రామాలలో క్రైస్తవుల ఇళ్ళు, చర్చిలు తగుల పెట్టారు. జనాన్ని అడవులలోకి తరిమారు. నిజానికి తలదాచుకోవడానికి చుట్టూ అడవి ఉండబట్టి బతికి పోయారు. అయినప్పటికీ 29 మంది చనిపోయారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం లెక్క. 50 మందికి పైగా చనిపోయారని బాధితులు అంటున్నారు. చాలా క్రూరంగా చంపారు. కొందరిని తగులబడుతున్న ఇళ్ళలో పడేసిచంపారు. కొందరిని కాళ్ళు నరికి ఆ తరువాత మెడ నరికి చంపారు. హత్యాకాండలో ఆదివాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని చెప్తున్నారుగానీ అడవి ప్రాంతంలో స్థిరపడిన సవర్ణ హిందువులూ ఇందులో పాల్గొన్నారని మాత్రం చెప్పడం లేదు. ఆదివాసులకూ దళితులకూ మధ్యనున్న ఆర్థిక–సామాజిక వైరుధ్యాలను కొంత మంది వేలెత్తి చూపి, అవే హింసాకాండకు అసలు కారణం అంటున్నారు. ఆదివాసులకూ దళితులకూ కొన్ని వైరుధ్యాలున్న మాట వాస్తవమే. దళితులలో ముఖ్యంగా క్రైస్తవులలో – చదువు స్థాయి సాపేక్షంగా ఎక్కువే. చిన్న చితక వ్యాపారాలు చేసే వారూ ఎక్కువే. ఆదివాసుల భూములను దళితులు స్వంతం చేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. అయితే ఈ వైరుధ్యాలు క్రైస్తవ దళితులతోనే కాదు క్రైస్తవం పుచ్చుకోని దళితులతోనూ ఉన్నాయి. సవర్ణ హిందువులతో ఇంకా ఎక్కువ ఉన్నాయి.

కాబట్టి అసలు విషయం ఆ వైరుధ్యాలు కాదు. ప్రజా వర్గాల మధ్య అనేక వైరుధ్యాలు ఉంటాయి. వాటిని వాడుకొని తాము అణచదలచుకున్న వర్గానికి వ్యతిరేకంగా మరొక వర్గాన్ని సాయుధం చేసి దాడులు చేయించడం హిందుత్వ వాదుల వ్యూహం. పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తారు. మీడియా వారి పాటే పాడుతుంది. ఈ వ్యూహం లక్ష్యం ఆ ప్రజావర్గాల మధ్య న్యాయాన్ని సాధించడం కాదు తమ రాజకీయ లక్ష్యాన్ని సాధించడం. ప్రత్యేకించి, తమ వ్యూహానికి ఆదివాసులు పనికొచ్చినప్పుడు వారికి సహజమైన మిలిటెన్సీని హిందుత్వ వాదులు చాలా క్రూరంగా వాడుకుంటున్నారు. గుజరాత్ మారణ కాండలో ఆదివాసీ ప్రాంతాలలో ఇది చూశాం. ఛత్తీస్‌గఢ్‌లో సల్వా జుడుం రూపంలో చూశాం. ఇప్పుడు కంధమాల్‌లో చూస్తున్నాం.

ఆదివాసులు తమ కోసం తాము చేసుకున్న పోరాటాలలో ఇందులో పదో వంతు మిలిటెన్సీని ప్రదర్శించినా ప్రభుత్వాలు అతి క్రూరంగా అణచివేశాయి. హిందుత్వవాదుల అజెండాలో చిక్కుకొని ఏ ప్రజావర్గాలకూ మేలుచేయని విధ్వంసానికి పాల్పడినప్పుడు మాత్రం హిందుత్వవాదులతో ఒకటైన పాలనా యంత్రాంగాలు వారి హింసాకాండను అనుమతిస్తున్నాయి. ఇది ఆదివాసుల ప్రజల మేలుకోరేవారు ఆందోళన చెందవలసిన విషయం.